నాణ్యమైన విద్యుత్ .. మెరుగైన సరఫరా లక్ష్యం

- భీమడోలు సబ్ డివిజన్‌లో రూ.1.20కోట్లతో అభివృద్ధి పనులు
- ఏన్నో ఏళ్ల నాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

భీమడోలు: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ప్రతి ఇంటికీ హెచ్చుతగ్గులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్న సంకల్పంతో పని చేస్తోంది. ఇందుకోసం ప్రధాన సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించే పనిలో విద్యుత్ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. జనాభాతో పాటు వారి అవసరాలు, విద్యుత్ కనెక్షన్ల సంఖ్య పెరుగుతోంది. సమస్యలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. దీనితో దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యలకు చెక్ పడుతోంది. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసారు. జాతీయ, రాష్ట్రీయ రహదారికి కూడలిగా ఉన్న భీమడోలు జంక్షన్‌లో దశాబ్దాల క్రితంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కండక్టర్ల వల్ల ఈ ప్రాంత ప్రజలు తరచూ అగ్ని ప్రమాదాలు, బ్రేక్ డౌన్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో అవస్థలు పడుతున్నారు. వేసవి వస్తే అనధికార కోతలు రెట్టింపు అవుతున్నాయి. దీనితో నిత్యం ప్రజలు, వ్యాపారులు నానా అగచాట్లు పడేవారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యలను ఎన్నడూ



భీమడోలులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్



భీమడోలు జంక్షన్‌లో విద్యుత్ స్తంభాలు వేస్తున్న సిబ్బంది

పట్టించుకున్న నాథుడు లేరు. విద్యుత్ ఎస్ఈ పి.సాల్మనరాజ్, ఈఈ టి.శశిధర్ సూచనల మేరకు భీమడోలు డీఈఈ కె.గోపాలకృష్ణ విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. డీఈఈ కె.గోపాలకృష్ణ, భీమడోలు ఏఈ పి.రామస్వామి మూడు నెలల కాలంలో భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లోని ప్రధాన పనులను యుద్ధప్రాతిపదికను పూర్తి చేసారు. ఏన్నో ఏళ్ల క్రితం భీమడోలు జంక్షన్, పోలసానిపల్లి ఏరియాల్లో నిరంతర విద్యుత్‌ను అందించేందుకు రూ.8లక్షలతో ఏర్పాటు చేసిన పాత కండక్టర్లు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి వాటి స్థానంలో కొత్త తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, విద్యుత్ స్తంభాలు వేసారు.

అభివృద్ధి పనులకు నిధుల వరద

భీమడోలులో రూ.4 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసారు. పలు ప్రాంతాల్లో రూ.20లక్షలతో కండక్టర్లు మార్చారు. పోలసానిపల్లిలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించి ప్రజావసరాల రీత్యా రూ.8లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు. మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను బీసీ కాలనీలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ద్వారకాతిరుమల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ నిలిపివేస్తే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కరెంట్ సరఫరా అవకాశమే లేదు. ఈ తరుణంలో ఇటీవల గుండుగొలను కుంట నుంచి ద్వారకాతిరుమలకు ప్రత్యేక లైన్ వేసి ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. గుండుగొలనులోనే 15 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఒకొక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.4 లక్షల చొప్పున రూ.60 లక్షలు వెచ్చించారు. సూరప్పగూడెం నుంచి పాతూరు వరకు రూ.4 లక్షలతో కండక్టర్ వేసారు. ఆగడాలలంకలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.8 లక్షలు, పాతూరులో రూ.4లక్షలతో ఒక ట్రాన్స్‌ఫార్మర్, ఎంఎంపురంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.8లక్షలు వెచ్చించారు.

ట్రాన్స్‌ఫార్మర్లను మార్పు చేశాం



గ్రామంలో 25 ఏళ్ల నాటి విద్యుత్ సమస్యలను పరిష్కరించాం. పలు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తేవి. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో సింగిల్ ఫేజ్ ఉన్న చోట త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసారు. మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం.

– షేక్ రహీమాబేగం హసీనా, సర్పంచ్, పోలసానిపల్లి

90 శాతం పనులు పూర్తి



ఉన్నతాధికారులు సహాయ సహాయ సహకారంతో విద్యుత్ సమస్యలను పరిష్కరించాం. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. 90శాతం పనులు పూర్తయ్యాయి. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం.

– కె.గోపాలకృష్ణ, డీఈఈ, భీమడోలు

అకాల వర్షం... రైతన్నల్లో గుబులు

భీమడోలు/గణపవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా మారిన వాతావరణం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. శనివారం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. అల్ప పీడన ప్రభావంతో రెండు రోజులుగా గ్రామాల్లో మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో డెల్టా, మెట్ట ప్రాంతాల్లో వరి, ఇతర ఉద్యానవన పంటలు ఆందోళన చెందుతున్నారు. దీనితో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీ పరిధిలో 14వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. శనివారం కురిసిన భారీ వర్షానికి పోలసానిపల్లి, అంబర్‌పేట, కోడూరపాడు, దుద్దేపూడి వంటి మెట్ట ప్రాంతాల్లో వరితో పాటు సాగు చేస్తున్న మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, మామిడి, నిమ్మ పంటకు తీరని నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. దాళ్వా సీజన్‌లో అలస్యంగా నాట్లు వేసిన 5శాతం రైతులను ఈ వర్షాలు నడ్డివిరుస్తున్నాయి. ఈ వర్షాల వల్ల గింజ కట్టి పడకుండా తాలు గింజలుగా మారే ప్రమాదముందని, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగుళ్ల చుట్టు ముడతాయని వాపోతున్నారు. ఈ వర్షాల వల్ల పంటకు ఎటువంటి నష్టం వాటిల్లదని వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు.



భీమడోలులో కురుస్తున్న భారీ వర్షం



గణపవరంలో ఈనికదశలో ఉన్న వరిచేలు

చురుగ్గా అర్జావారిగూడెంలో రామాలయం నిర్మాణం





అర్జావారిగూడెంలో నిర్మిస్తున్న రామాలయం, ఆలయంలో ఆర్డీవో దాసి రాజు ఆర్థిక సాయంతో నిర్మించనున్న ద్వారం

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు అర్జావారిగూడెంలో రామాలయం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. టీటీడీ, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంజూరైన నిధులతో ఇక్కడ రామాలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. దళిత వాడల్లో హిందూ పరిరక్షణ, సనాతన సాంప్రదాయాలను పరిరక్షించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం జీర్ణోద్ధరణ చెందిన ఆలయాలను నిర్మిస్తోంది. గతంలో ఇక్కడ ఉన్న రామాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని పునర్నిర్మించేందుకు అవసరమైన నిధుల కోసం సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు దృష్టికి తీసుకుని వెళ్లారు. వారు ప్రత్యేక కృషి చేసి రూ.10లక్షల నిధులు మంజూరు చేసారు. దీనితో పనులు వేగంగా సాగుతున్నాయి. అర్జావారిగూడెంకు చెందిన పశ్చిమగోదావరి జిల్లా ఆర్డీవో దాసి రాజు తన తండ్రి సుదర్శనం జ్ఞాపకార్థం రూ.50వేలను అందించారని సర్పంచ్ శనివారం తెలిపారు. దీనితో ఆలయ ద్వారాన్ని సుందరంగా నిర్మించే పనులను శిల్పారామం కళాకారులకు అప్పగించామన్నారు. దాతలు మరింత మంది ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని సర్పంచ్, పెద్దలు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణం పరిశీలన

పెదపాడు : లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు సూచించారు. పాతముప్పర్రులో శనివారం మండలస్థాయి అధికారులతో కలిసి హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడతామన్నారు. ఎంపీడీవో ఎస్ నిర్మల జ్యోతి, ఏపీఎం దాసరి సుమలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగదుర్గాదేవికి ప్రత్యేక పూజలు

పెదపాడు : ఓం నాగదుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా శనివారం పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాదరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. కలపర్రులోని కాముని చెరువు వద్ద నాగదుర్గాదేవి ఆలయంలో గణపతి సుబ్రహ్మణ్యేశ్వర కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలికుడు ఘంటా ప్రసాదరావు, స్థానిక వత్రపు విష్ణుతులసి కోటిరెడ్డి పాల్గొన్నారు.

పాటెమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

దెందులూరు: చల్లచింతలపూడిలోని నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం పాటెమ్మ తల్లి విగ్రహావిష్కరణ, నూతన ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. యలమర్తి వారి ఆడపడుచు, ఇలవేల్పు అయిన పాటెమ్మ తల్లి విగ్రహానికి తొలుత అర్చకులు, యలమర్తి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, చల్లచింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, మాజీ సర్పంచ్ యలమర్తి హేమలత శ్రీనివాసరావు, సీతంపేట సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), గారపాటి చౌదరి, ప్రజా ప్రతినిధులు, నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు, ప్రజాప్రతినిధులకు పంపిణీ చేశారు.



చల్లచింతలపూడి పాటెమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న కొఠారు రామచంద్రరావు

రొయ్యల చెరువులుగా మార్పిడి చేసుకోవాలి

మండవల్లి: మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ బాలశౌరి మండవల్లి ఒక కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా స్థానిక చేబోయిన వీర్రాజు ఇంటి వద్ద శనివారం కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ బిల్లులపై సబ్సిడీ రావడం లేదని పార్థసారథిని అడిగారు. ఆయన ఎస్ఈకి ఫోన్ చేసి విషయం తెలుసుకున్నారు. రొయ్యల సాగు రైతుల పొలాలు, చేపల సాగుగా నమోదు కావడంతో సబ్సిడీ రావడం లేదని ఎస్ఈ చెప్పినట్లు పార్థసారథి పేర్కొన్నారు. తహసీల్దార్ వద్ద నుండి రొయ్యల సాగు అన్న సర్టిఫికెట్ తీసుకుంటే విద్యుత్ బిల్లులపై సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్, సర్పంచ్ మెండా ఝాన్సీ, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.గోకర్ణయాదవ్, మెండా సురేష్, సర్పంచ్ గుడివాడ తమ్మిస్వామి, జి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.




మండవల్లిలో వీర్రాజు ఇంటి వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి పార్థసారథి, పక్కన ఎంపీ బాలశౌరి

సైబర్ నేరాలు, దిశ యాప్‌పై అవగాహన

దెందులూరు: విద్యార్థులు సైబర్ నేరాలు, దిశ యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వార్తలు పట్ల అవగాహన పెంపొందించుకోవాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. శనివారం కళాశాలలో సైబర్ నేరాలు, దిశా యాప్‌పై వ్యాయామ విద్యార్థులకు అవగాహన కల్పించారు. టెక్నాలజీని విజ్ఞానానికి పరిధిలో ఉపయోగించుకోవాలని సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. గ్రామ మహిళా పోలీస్ కనకదుర్గ చట్టాలు, నేరాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం బేబి నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పీడీకేడీ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ రమేష్, ఫిజికల్‌డైరెక్టర్లు డాక్టర్ శ్యామల, జయలక్ష్మి ఉన్నారు.

పాఠశాలలకు వరం నాడు-నేడు పథకం

ఉంగుటూరు(గణపవరం): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చిన నాడు-నేడు పథకం ఒక వరమని మండల వైఎస్సార్ సీపీ బాధ్యుడు పుప్పాల చినబాబు అన్నారు. శనివారం ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంలో రూ.30 లక్షలతో చేపట్టే పనులకు ఆయన ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచ్ బండారు సింధు మధుబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరకొర వసతులతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నారి అన్నారు. ఇప్పటికే మొదటి విడత నాడు-నేడు పనులు పూర్తయి రెండో విడత పనులు సాగుతున్నాయన్నారు. పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రముఖులతో ఆయన చర్చించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మరడ మంగారావు, సర్పంచ్ మాజీ సర్పంచ్‌లు దొంతంశెట్టి సత్యనారాయణ, పెనుగొండ సూర్యచంద్రరావు, పార్టీ నాయకులు గంటా సుబ్బారావు , దూసనపూడి లక్ష్మీనారాయణ, రంగు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉంగుటూరు హైస్కూల్లో నాడు-నేడు పనులపై స్థానిక నేతలతో చర్చిస్తున్న పుప్పాల చినబాబు

క్లుప్తంగా

కల్యాణోత్సవాలు ప్రారంభం



మల్లేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణోత్సవాల్లో మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవారు

మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం మల్లేశ్వరస్వామిని పెండ్లికుమారుడిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలకంరించారు. అనంతరం అభిషేకాలు, సమస్రనామార్చనలు నిర్వహించారు. కలశ స్థాపన, అఖండ స్థాపన, బలిహరణ, మంత్రపుష్ప నీరాజనాలు, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వర్షంతో రాకపోకలకు అంతరాయం



కైకలూరు వీధిలో రహదారిపై వర్షం నీరు

మండవల్లి: మండవల్లిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. ఈ కారణంగా రోడ్లు జలమయమయ్యాయి. స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారిపై గుంతలు పడిన ఏరియాల్లో వర్షం నీరు నిలిచి ప్రయాణీకులు సమస్యలు ఎదుర్కొన్నారు. కైకలూరు వీధిలో కురిసిన వర్షానికి ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. మండలంలో 3 వేల ఎకరాల్లో మినుము పైరు రైతులు సాగు చేశారు. శనివారం 2.40 ఎంఎల్ వర్షపాతం నమోదైందని, ఇంకా వర్షం కురిస్తే మినుము రైతులకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

పోతునూరులో ఉచిత వైద్య శిబిరం



పోతునూరులో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ.డేవిడ్‌రాజు అన్నారు. శనివారం పోతునూరులోని పరిశుద్ధ నిత్య సహాయమాత దేవాలయంలో వంగాయగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్, జనరల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎం.చంద్ర, డాక్టర్ అక్బర్ బాషా, ఎముకలు, కీళ్లు, కిడ్నీ, మూత్రకోశ, క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. గుడ్ సమరిటన్ పీఆర్‌ఓ రాజు బాధితులకు ఇతర వైద్యసేవల కొనసాగింపుపై సలహాలు, సూచనలు ఇచ్చారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెదపాడు: మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. కలపర్రు గ్రామంలో మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆహార పదార్థాలను వడ్డించారు. విద్యార్థులతోపాటు భోజనాన్ని రుచి చూసారు. నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు అందించారు. ప్రధానోపాధ్యాయులు పెద్ది సురేష్ పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

గణపవరం: ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని వైద్యసిబ్బంది తల్లులకు సూచించారు. శనివారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడులో వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరం నిర్వహించి పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ఆరోగ్యసహాయకుడు నామాలరాజు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయస్సు వచ్చే వరకు షెడ్యూలు ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా మాత్రలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలపై వినతి

గణపవరం: డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని, వారికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ గణపవరం మండల డ్వాక్రా యానిమేటర్ల సంఘం డిమాండ్ చేసింది. శనివారం డ్వాక్రా యానిమేటర్లు గణపవరం వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, వెలుగు అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల డ్వాక్రా యానిమేటర్స్ సంఘం జిల్లా కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్లకు రోజురోజుకు పని భారం పెరుగుతుందని, శ్రమకు తగ్గ వేతనం దక్కడం లేదని అన్నారు. ప్రభుత్వం ఈవిషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆసుపత్రికి వీల్ చైర్ వితరణ

భీమడోలు: మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల సహకారంతో శనివారం పూళ్ల పీహెచ్‌సీకి ఓ వీల్ చైర్, ఓ నిరుపేద దివ్యాంగుడిని ట్రై సైకిల్ బ్యాటరీలను అందించారు. పూళ్ల గ్రామానికి చెందిన వడ్డి రాజు కుటుంబ సభ్యులు మానవత సభ్యులు యడ్లపల్లి ఏసుబాబు ద్వారా రోగులకు తరలించేందుకు ప్రత్యేక వీల్ చైర్స్‌ను మానవత సంస్థకు బహూకరించారు. ఆ వీల్ చైర్‌ను పూళ్ల పీహెచ్‌సీ వైద్యులు బి.లీలా ప్రసాద్, ఈ.కల్యాణి మహేశ్వరి, డాక్టర్ అరవిందకు మానవత మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు చేతుల మీదుగా అందజేసారు. ఆ వీల్ చైర్‌ను గుల్ల నూకరాజు ప్రారంభించారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులను ఆసుపత్రిలోకి తీసుకుని వచ్చేందుకు ఈ వీల్ చైర్ ఎంతగానో దోహద పడుతుందని వైద్యులు తెలిపారు. గ్రామంలోని కృష్ణకాలనీకి చెందిన దివ్యాంగుడు కొమ్ము జోసఫ్ ట్రై సైకిల్‌కు అవసరమైన బ్యాటరీని దాతలు కేతినీడి విశ్వేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, యాసా వెంకట్రామయ్య ఆర్థిక సాయంతో అందించారు. ఈ సందర్భంగా మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమ సమాజాన్ని నెలకొల్పేందుకు మానవతావాదులంతా ఐక్యతతో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, ప్రతినిధులు దోకల పెద చిన్నారావు, దాసం మంగయ్య, రాజేష్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి శేష వాహన సేవ

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి శేష వాహన సేవ కన్నుల వేడుకగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని శేష వాహనంపై ఊరేగించారు. అర్చకులు శ్రీనివాసుల విజయాచార్యులు, మంగపతి అచార్యులు, సుధీరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని మేళాతాళాల నడుమ గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, ఈవో డి.శంకరరావు పాల్గొన్నారు.